ప్రజాశక్తి
మంగళవారం 27 మే 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అమరావతి, పోలవరం చుట్టూనే..

- గత పరిస్థితులనే తలపిస్తున్న చంద్రబాబు పాలన
- ఆపరేషన్ కగార్‌తో మానవుల వేట ఆపాలి
- మీడియాతో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు ఇష్టాగోష్టి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో ఏడాది కాలంలోని చంద్రబాబు పాలన ఇదివరకటి 5ఏళ్ల పాలననే తలపిస్తోందని, ఆ తప్పులే అమరావతి, పోలవరం విషయంలో చేస్తూ రాష్ట్రాన్ని వాటి చుట్టూ తిప్పుతున్నారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సమస్యను, రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించే విషయాలను పట్టించుకోవడం లేదన్నారు. సోమవారం విశాఖకు విచ్చేసిన ఆయన జగదాంబ సమీపంలోని సిపిఎం కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆయనతో పాటు పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఉన్నారు. దేశం, రాష్ట్రం, అంతర్జాతీయంగా సాగుతున్న రాజకీయ సామాజిక ఆర్థిక పరిస్థితులు, అమరావతి, పోలవరం, ఇండియా పాకిస్తాన్ మధ్య యుద్ధం, ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టుల హతం అవుతున్న తీరుపై మీడియా ప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై తనదైన శైలిలో బివి.రాఘవులు సమాధానమిచ్చారు.

కొత్త సీసాలో పాత సారా మాదిరే...

రాష్ట్రంలో పాలనపై రాఘవులు స్పందిస్తూ గత జగన్ ప్రభుత్వం విశాఖ రాజధాని అని చెప్పి అమరావతి పట్ల సరిగా వ్యవహరించలేదని, పోలవరంలో అక్రమాలు జరిగినట్లు నివేదికలు కూడా ఉన్నాయని తెలిపారు. వీటిపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టిసారించడం లేదని, రాష్ట్రానికి జగన్ చేసిన అన్యాయాలను తాము సరిదిద్దుతున్నామని చెబుతూనే అవే తప్పులు చంద్రబాబు చేస్తున్నారని పేర్కొన్నారు. పోలవరం పాత డిజైన్‌లోనే నిర్మాణానికి చంద్రబాబు వెళు_న్నారని ఇదే కొనసాగితే కాళేశ్వరం ప్రాజెక్టు గతే పోలవరానికి పడుతుందని తెలిపారు. నిపుణులైన ఇంజినీర్లు కూడా ఇదే చెప్పారన్నారు.

మీడియాతో ఇష్టాగోష్టిలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

ఐటి సెక్టార్‌పై...

ఐటిపై రాఘవులు స్పందిస్తూ ఐటి సెక్టార్ ఎవరు రమ్మన్నా రాదని, పొమ్మన్నా పోదని, అనుకూల వాతావరణం ఉంటేనే పరిశ్రమలు వస్తాయని చెప్పారు. బెంగళూరు, పూణె, హైదరాబాద్‌లో ఆ వాతావరణం ఉండబట్టే అక్కడ ఐటి

మిగతా 2లో..

ఇరకాటంలో బండారు, రాజు

నియోజకవర్గాల్లో తగలనున్న అదానీ సెగ
నిధుల కేటాయింపులోనూ సమస్యలే
చెప్పకోలేక కుంగుపాటు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని మాడుగుల, చోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కెఎస్ఎన్ఎస్.రాజును ప్రభుత్వ విధాన నిర్ణయాలు ఇరకాటంలోకి నెడుతున్నాయి. రైవాడ జలాశయంపై అదానీ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం, గోవాడ సహకార చక్కెర ఫ్యాక్టరీని ఆధునీకరించకుండా, బలహీనపర్చి మూసివేసేలా ప్రభుత్వ చర్యలు ఉండడంతో వారిద్దరూ తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు. ఈ రెండు నియోజకవర్గ పరిధిలో రైవాడ జలాశయం, గోవాడ చెరకు రైతులు ఉన్నారు. పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుతో రాబోయేకాలంలో రైవాడ జలాశయ కింద ఆయకట్టుకు సాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడనుంది. సహకార సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యం పెంచి, రైతులకు దోహదపడేలా ఫ్యాక్టరీని తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలకు భిన్నంగా... ఎంపీ సీఎం రమేష్ చేతిలో పెట్టే కుట్రలు సాగుతున్నాయి. రాజకీయంగా నష్టపోయే ప్రభుత్వ చర్యలు బండారు, రాజుకు మింగుడుపడ్డంలేదు. అలాగని అదాని ప్రాజెక్టు వద్దని ధైర్యంచేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెప్పలేక చితికిపోతున్నారు. గ్రామీణ నేపథ్యం

బండారు

కెఎస్ఎన్ఎస్.రాజు

కల్గిన ఈ నియోజకవర్గాల్లో సాగునీటివనరుల అభివృద్ధి, జలాశయాల సాగు స్థిరీకరణకు సరిపడా నిధులూ ప్రభుత్వం కేటాయించడంలేదు. జనసేన ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్‌కుమార్, పంచకర్ల రమేష్‌బాబుకు ఇస్తున్న ప్రాధాన్యత తమ ప్రాతినిధ్య నియోజకవర్గాలకు ఇవ్వడంలేదని వారిద్దరూ మదనపడుతున్నారు. కొన్ని నెలలపాటు తనకు జరుగుతున్న అవమానాల్ని కడుపులోదాచుకొని కుంగిపోతున్న బండారు, కొద్ది రోజుల క్రితం జరిగిన టిడిపి జిల్లా మినీ మహానాడును వేదికగా చేసుకున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లాకు చెందిన హోం మంత్రి అనిత సమక్షంలో ఎవరికి చెప్పుకోవాలి మా బాధంటూ

మిగతా 2లో..

పథకం ప్రకారమే...

ఉక్కు కార్మికుల తొలగింపుపై బివి రాఘవులు

▶ వార్త మెయిన్‌లో..

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులతో అధికారుల చర్చలు విఫలం

▶ వార్త మెయిన్‌లో..

దేశ సార్వభౌమ సామర్థ్యాన్ని తాకట్టు పెట్టేలా కేంద్రం పోకడలు

▶ వార్త మెయిన్‌లో..

రమణారావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు

రమణారావు స్ఫూర్తితో ముందుకు సాగాలి

వార్త మెయిన్‌లో..

ప్రజా సమస్యలపై అంకిత భావంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జివిఎంసి అడిషనల్ కమిషనర్ వర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని, అందువల్ల అర్జీలు పునరావతం కాకుండా ఉంటాయని తెలిపారు.

అధికారుల సమక్షంలో అర్జీదారులతో కలెక్టర్ స్వయంగా ఫోన్లో మాట్లాడారు. అర్జీదారుల సమస్యను స్వయంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

వినతులు స్వీకరిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

అధికారులతో సమీక్ష సమావేశం...

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ, ల్యాండ్ సర్వే, అటవీ శాఖ, పోలీస్, జివిఎంసిలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని, వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అర్జీదారులు తమ అర్జీ వివరాలను తెలుసుకునేందుకు 1100 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తమ ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవచ్చుని, ఏవైనా సందేహాలుంటే

మిగతా 2లో..

అమరావతి, పోలవరం చుట్టూనే..

ముందుకెళ్తుందన్నారు. మోడీ ఇటీవల మాట్లాడుతూ మహిళలు వర్క్ ఫోర్స్‌లోకి రావాలనడం మంచి విషయమేనని, ఐతే ఇండియాలో ఎక్కడ చూసినా మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఉంటే ఉత్పత్తి కార్యక్రమాల్లోకి ఎలా వస్తారో మోడీ చెప్పాలన్నారు. చైనాలో నూటికి 74 మంది మహిళలు ఉత్పత్తి రంగంలో ఉంటే ఇండియాలో 24 మందే ఉన్నారని తెలిపారు. పనుల్లో వారికి రక్షణ కల్పించాలని, ముందు బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలకు అలా చేసి నిరూపించాలని మోడీని రాఘవులు కోరారు.

ఆపరేషన్ కగార్ ఒక మానవ వేట....

ఆపరేషన్ కగార్‌పై స్పందిస్తూ కగార్ పేరుతో మానవ వేట అడవుల్లో సాగుతుందని, దీన్ని తక్షణం ఆపాలని రాఘవులు డిమాండ్ చేశారు. వారు చర్చలకు వస్తామన్నా చర్చించకపోవడం ఏమిటి? అని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి (బిజెపి) మావోయిస్టులను అంతమొందిస్తాం అంటూ బహిరంగ ప్రకటన చేయడం అభ్యంతరకరమని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలు ఇలా వ్యవహరించకూడదని చెప్పారు. ఇండియా పాకిస్తాన్ యుద్ధంపై మీడియా ప్రశ్నలకు స్పందిస్తూ యుద్ధం ఆగడానికి రాజకీయ కారణాలేమీ ఉండవని, ఆర్థిక పరమైన అంశాలే కీలకపాత్ర పోషించాయని తాము భావిస్తున్నామన్నారు. 'ఇద్దరినీ ఒత్తిడి చేసి లేదా భయపెట్టి (ఐఎంఎఫ్ అప్పు రాదని) ఒప్పించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆపినట్లు చేశాడని అర్థం అవుతుందన్నారు.

ఇరకాటంలో బండారు, రాజు

ఆయన చేసిన వ్యాఖ్యలు కూటమి పార్టీలను కుదిపేసింది. బండారు మాటలతో టిడిపిలో ఎమ్మెల్యేలందరికీ సమాన గౌరవం దక్కని విషయం బహిర్గతమైంది. కూటమిలోని భాగస్వామ్య పార్టీ జనసేన ఎమ్మెల్యేలకు చేసిన కేటాయింపులు కంటే టిడిపి ఎమ్మెల్యే బండారుకు తక్కువ ఇస్తున్నారు. చోడవరం ఎమ్మెల్యే రాజు మహానాడులో నోరు విప్పలేకపోయినా నిధుల కేటాయింపులో చూపుతున్న వివక్షతను బండారు విస్ఫోటనంలా విన్పించారు. నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితుల సృష్టిపై ఆయన నోరు విప్పకతప్పకలేదు. జనసేన ఎమ్మెల్యేలను సంతృప్తిపర్చే క్రమంలో టిడిపి ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో వారిలో అసంతృప్తి పెరుగుతోంది.

ప్రజా సమస్యలపై అంకిత భావంతో పనిచేయాలి

అడగవచ్చని కలెక్టర్ తెలిపారు. 1100 కాల్ సెంటర్ ద్వారా కొత్త ఫిర్యాదులు కూడా నమోదు చేయవచ్చని చెప్పారు.

సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 237 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూకు 94, పోలీసు శాఖకు సంబంధించి 21, జివిఎంసి 64, ఇతర విభాగాలకు సంబంధించి 58 వినతులు వచ్చాయి.

ఎయూ డిగ్రీ పరీక్షల్లో 'ఆదిత్య' విద్యార్థులకు ర్యాంకుల పంట

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆదిత్య డిగ్రీ కళాశాల విశాఖపట్నం విద్యార్థులు ఆంధ్రా యూనివర్శిటీ డిగ్రీ కోర్సుకు సంబంధించి వివిధ విభాగాల్లో యూనివర్శిటీ ఫలితాల్లో 1, 2, 3 ర్యాంకులతో పాటు మొత్తం 12 ర్యాంకులను కైవసం చేసుకున్నారు. బిసిఎ విభాగం నుండి దున్నా ధనలక్ష్మి 1వ ర్యాంక్ (9.53 సిజిపిఎ), పావని 2వ ర్యాంక్ (9.51 సిజిపిఎ), పెన్మత్స క్యాత్రిశ్రీ 2వ ర్యాంక్ (9.51 సిజిపిఎ), బొడువు శిరీష 3వ ర్యాంక్ (9.50 సిజిపిఎ), గంగు రిపిక 3వ ర్యాంక్ (9.50 సిజిపిఎ)ను మొదటి మూడు స్థానాలు ఆదిత్య డిగ్రీ బిసిఎ విద్యార్థులు కైవసం చేసుకోగా, బిబిఎ విభాగం సంతనదు కోరిపోలు మహిత 2వ ర్యాంకు (9.04 సిజిపిఎ), వానపల్లి మౌనిక 3వ ర్యాంక్ (9.1 సిజిపిఎ), గుండ్రు వెంకటసాయికీర్తి 3వ ర్యాంక్ (9.0 సిజిపిఎ), బిఎస్సి.విభాగం నుండి మండల యమున 1వ ర్యాంక్ (9.74 సిజిపిఎ), సత్తి మోనిక విషాల్ 3వ ర్యాంక్ (9.72 సిజిపిఎ), బి.కామ్ విభాగం నుండి పల్లేటి పల్లవి 3వ ర్యాంక్ (8.96 సిజిపిఎ), క్రెసింగ్ హరిప్రియ 2వ ర్యాంక్ (8.96 సిజిపిఎ) మొత్తంగా బిసిఎ విభాగంలో 5 ర్యాంకులు, బిబిఎ విభాగంలో 3 ర్యాంకులు, బిఎస్సి విభాగంలో 2 ర్యాంకులు, బికాం విభాగంలో 2 ర్యాంకులు కైవసం చేసుకున్నారు. యూనివర్శిటీ పరీక్షల్లో అత్యధిక ర్యాంకులను సాధించిన ఆదిత్యడిగ్రీ విద్యార్థులను, కళాశాల యాజమాన్యాన్ని ఆంధ్రాయూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనంజయరావు ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ సుగుణరెడ్డి విద్యార్థులను అభినందించారు.

ఆర్టిస్టుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు అథారిటీ పరిధిలో ఉన్న గోడల మీద కళారూపాలు (బొమ్మలు) వేసిన ఆర్టిస్టులకు కెసిఎస్ కన్స్ట్రక్షన్స్ యాజమాన్యం బకాయి ఉన్న రూ.11 లక్షలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జగదాంబ జోన్ ఉపాధ్యక్షులు వై.రాజు డిమాండ్ చేశారు. సీహార్స్ జంక్షన్లో ఉన్న పోర్టు అథారిటీ కార్యాలయం ఎదుట సోమవారం సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, పోర్టు అథారిటీ పరిధిలో ఉన్న గోడల మీద కళారూపాలు (బొమ్మలు) వేసే పనికి కెసిఎస్ కన్స్ట్రక్షన్ సంస్థ యజమాని కంఠం చంద్రశేఖర్ కాంట్రాక్టుకు తీసుకున్నారని, ఈ పని పూర్తి చేయడానికి రాజు ఆర్ట్స్ 10 మంది ఆర్టిస్టులను సుమారు ఏడాది పాటు ఉపయోగించుకొని, బొమ్మలు వేసే పనులను పూర్తి చేశారని తెలిపారు. ఒక లక్షా 75 వేల చదరపు అడుగుల పనులకు అడ్వాన్స్ పోను రూ.11 లక్షలు లేబర్ ఛార్జీ చెల్లించాల్సి ఉందని, దాదాపు 5 నెలలు గడిచినప్పటికీ ఆర్టిస్టులకు లేబర్ ఛార్జీలు అందక వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. పోర్టు అథారిటీ ఛైర్మన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు ఎటువంటి చర్య తీసుకోలేదన్నారు. సంబంధిత పోర్టు అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై ఆర్టిస్టులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పోర్టు అధికారులు వెంటనే స్పందించి ఆర్టిస్టులకు లేబర్ ఛార్జీలు ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్, ఆర్టిస్టులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఆర్టిస్టులు

వాటర్ ఫెడరేషన్ ప్లాంట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

పి.వెంకటరెడ్డి డిమాండ్

డిప్యూటీ మేయర్‌కు సమస్యను వివరిస్తున్న వెంకటరెడ్డి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వాటర్ ఫెడరేషన్ ప్లాంట్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని, జివిఎంసి డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డిని జివిఎంసి వాటర్ ఫెడరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి కోరారు. దల్లి గోవిందరెడ్డి డిప్యూటీ మేయర్‌గా సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడానికి సోమవారం సాయంత్రం యూనియన్ ప్రతినిధులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వాటర్ ఫెడరేషన్ ప్లాంట్ వర్కర్ల సమస్యలు వివరించారు. అనంతరం చీఫ్ ఇంజినీర్ శివప్రసాద్‌రాజును ప్రతినిధి వర్గం కలిసింది. ఈ సందర్భంగా 11 మంది కార్మికుల టెక్నికల్ సమస్యను పరిష్కరించాలని, అప్‌లోడ్ చేసి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు శంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, కోశాధికారి కె.వెంకటరావు, దాలిరాజు, శ్రావణ్, నాగు, రవి, కనకరాజు, వెంకటేష్, రమణబాబు, శ్రీను పాల్గొన్నారు.

జి. ఉమామహేశ్వరరావు
అధ్యక్షులు

ఎం. దేవీశ్వరరావు
ప్రధాన కార్యదర్శి

పోర్టు ఎస్‌సి, ఎస్‌టి ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎస్‌సి, ఎస్‌టి ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం పోర్టు ఏరియాలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.ఉమామహేశ్వరరావు, ఎం.దేవీశ్వరరావు మరోసారి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎం.సాల్మన్‌రాజు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ టిఎస్.దీప్తి, కె.వేణుగోపాల్, ఇ.వెంకట్రావు, పి.ప్రసన్నకుమార్, సంయుక్త కార్యదర్శులుగా పి.సుందరేషన్, కె.శ్రీను, కె.సిద్దార్థకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎమ్ఎస్.రావు, బూరి శ్రీను, ఎ.సంజీవరావు, కెవి.రమణ, పలువురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో పనిచేస్తామని తెలిపారు. పోర్టులోని ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

'ఎన్‌టిఆర్ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ జయంతిని తెలుగు వారి ఆత్మగౌరవ దినోత్సవంగా ప్రకటించాలని, ప్రభుత్వమే నిర్వహించేలా జిఒ విడుదల చేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్‌చేశారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి దీనిపై సానుకూలంగా స్పందించి ఎన్‌టిఆర్ జయంతిని ఆత్మగౌరవ దినోత్సవంగా జరుపుకునే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కోడె బాబూరావు పాల్గొన్నారు.

జివిఎంసి గ్రీవెన్స్‌కు 58 వినతులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 58 వినతులు వచ్చాయని జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి తెలిపారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకటో జోన్‌కు 1, రెండో జోన్‌కు 9, మూడో జోన్‌కు 7, నాలుగో జోన్‌కు 7, ఐదో జోన్‌కు 10, ఆరో జోనుకు 8, ఎనిమిదవ జోన్‌కు 3, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 13 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించాలి

ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించాలని వామ పక్ష, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పి.చంద్రశేఖర్ అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహమాన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.మణి, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఎం. లక్ష్మి, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ప్రతినిధి కె.పద్మ మీడియాతో మాట్లాడుతూ, నంబాళ్ల కేశవరావు, మరో నలుగురు మరణించి ఐదు రోజులు అయినప్పటికీ, వారి మృతదేహాలను అప్పగించాలని ఏపి హైకోర్టు ఆదేశించినప్పటికీ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, ఏపి ప్రభుత్వం నాటకాలాడుతూ భౌతికకాయాలను అప్పజెప్పకపోవడం దుర్మార్గం అన్నారు. రాజ్యాంగ వ్యతిరేక చర్య అని, మానవత్వాన్ని అపహాస్యం చేసే చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర మంత్రి అచ్చన్నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యత వహించి ఛత్తీస్‌గఢ్ నుంచి భౌతిక కాయలను రప్పించి అంతిమ సంస్కారాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విప్లవ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఎన్.రవి, ఎం.సాంబమూర్తి, న్యాయవాదులు అబ్బాయిరెడ్డి, బ్రహ్మం, ప్రగతిశీల కార్మిక సమాఖ్య అన్నపూర్ణ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

రోడ్డు నిర్మాణ పనులకు అడ్డంకి

- రహదారికి అడ్డంగా సిమెంట్ స్తంభాల కంచె ఏర్పాటు
- ఆ స్థలం తనదంటూ ఒక ప్రైవేటు వ్యక్తి అభ్యంతరం

దారికి అడ్డుగా ప్రైవేటు వ్యక్తి వేసిన కంచె

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఏడోవార్డు పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో జివిఎంసి ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులను ఒక వ్యక్తి అడ్డుకున్నాడు. రహదారి మధ్యలో అడ్డంగా సిమెంట్ స్తంభాలను పాతి కంచెను ఏర్పాటు చేశారు. ప్రతిపాదిత రహదారి పనులు తనకు చెందిన స్థలంలోంచి జరుపుతున్నారని, దీనిపై తనకు ఎటువంటి సమాచారం లేకపోగా, నష్టపోతున్న భూమికి ఎటువంటి పరిహారం కూడా చెల్లించలేదని అంటున్నాడు. రోడ్డు నిర్మాణంలో నష్టపోతున్న భూమికి న్యాయసమ్మతమైన టిడిఆర్‌తో పరిహారం చెల్లిస్తే కంచె తొలగిస్తానని సంబంధిత వ్యక్తి చెబుతున్నాడని జివిఎంసి రెండో జోన్ అధికారులు అంటున్నారు. ఒక ప్రైవేటు వ్యక్తి రోడ్డుకు అడ్డంగా సిమెంట్ స్తంభాలను పాతడంతో ఆమార్గంలో ఇప్పటివరకు రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు, వాహనదారులు, ముఖ్యంగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వాంబే కాలనీ, కళానగర్‌తో పాటు అటుగా ఉండే తదితర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మధురవాడ వద్ద జాతీయ రహదారికి చేరుకునేందుకు ఇదే ప్రధాన మార్గం కావడంతో వారికి అవస్థలు తప్పలేదు. దీనిపై వార్డు కార్పొరేటర్‌తోపాటు సంబంధిత అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

2వ హామీల అమలుకు ధర్నా

ప్రజాశక్తి-మధురవాడ :కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు, తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోరుతూవచ్చేనెల 2న విశాఖ రూరల్ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు పట్టణాలలో అర్హులైన పేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చెయ్యాలని కోరారు. . సోమవారం 7వ వార్డు మధురవాడ మల్లయ్యపాలెంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఇళ్ల కోసం వ్యక్తిగత దరఖాస్తులు చేసుకున్న ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కొల్లి రాములమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

రామారావు మృతి తీరనిలోటు

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక మార్కెట్ సంఘం అధ్యక్షుడు, సిపిఐ సభ్యుడు ఎం. రామారావు మృతి ఆ పార్టీకి తీరనిలోటని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎజె.స్టాలిన్ అన్నారు. సోమవారం రామారావు స్వగృహం వద్ద ఆయన పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ. గాజువాక మార్కెట్ అభివృద్ధికి రామారావు చేసిన సేవలు మరువరానివని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్, న్యాయవాది ఎవి.లెనిన్, నాయకులు అప్పారి విష్ణు మూర్తి, పోలారావు, పప్పు అప్పారావు, క్రి వెంకటేశ్వరరావు, సలీం, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల పునరుద్ధరణపై హర్షం

ప్రజాశక్తి- పెందుర్తి : రేషన్‌డిపోల ద్వారా సరుకుల పంపిణీకి నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జనసేన ఉమ్మడి రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును 97వార్డు సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల వేసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చేనెల ఒకటి నుండి రేషన్ డిపోల ద్వారా సరుకుల పంపిణీని పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు చిట్టి రాజు, జిల్లా సెక్రెటరీ నాకేనా ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సేలా శ్రీనివాసరావు, సరగడం వెంకటరావు, చెరుకూరి వెంకట్రావు, సత్యనారాయణ, రాము మహిళా ఆర్గనైజేషన్ తనూజ, పలు గ్రామాల రేషన్‌డీలర్స్ పాల్గొన్నారు.

యుజిడి పనుల నాణ్యతలో రాజీ వద్దు

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 93వ వార్డు ప్రహ్లాదపురం, పల్లి నారాయణపురంలో యుజిడికి అనుసంధానంగా జరుగుతున్న హౌస్ సర్వీస్ కనెక్షన్ (హెచ్ఎస్ఎల్) పనులను సోమవారం ఆ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, వాటర్ వర్క్స్ ఇంజినీర్లతో కలిసి పరిశీలించారు. 2.38కోట్లతో ఈ ఏడాది జనవరిలో యూజిడి మెయిన్ లైన్ పనులు జరగ్గా, ఇపుడు దానికి అనుసంధానంగా రూ.67లక్షలతో హెచ్ఎస్ఎల్ పనులు జరుగుతున్నాయి. ఈసందర్భంగా పనులు పరిశీలించిన కార్పొరేటర్ మాట్లాడుతూ, యుజిడి అనుసంధాన పనులను ప్రతిరోజూ అధికారులు పర్యవేక్షించాలని, పనుల నాణ్యతలో రాజీ పడకుండా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున యుజిడికి తవ్విన గోతులను ఎప్పటికప్పుడు పూడ్చి చదును చేయాలన్నారు. డిఇఇ వీరయ్య, ఎఇఇ రాజశేఖర్, కాంట్రాక్టు సూపర్‌వైజర్ నక్క అప్పారావు పాల్గొన్నారు.

యుజిడిలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాపర్తి కన్నా

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

పెదబాలశిక్ష బహూకరిస్తున్న పాపారావు

ప్రజాశక్తి-ములగాడ: నిరంతరం పుస్తకాలను చదివి, తన జీవితాన్ని విద్యకు అంకితం చేయడం ద్వారా డాక్టర్ అంబేద్కర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం మల్కాపురం శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా 'అంబేద్కర్ జీవితం, దేశాభివృద్ధిలో ఆయన పాత్ర అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ఎన్నో కష్టాలను భరించి, అంబేద్కర్ భారత ప్రజలకు వెలుగు బాట చూపించారన్నారు. అంబేద్కర్ నుంచి శాస్త్రీయ దృక్పథాన్ని, తర్కాన్ని అంతా నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పెదబాలశిక్ష పుస్తకాన్ని స్థానికుడు కె.పాపారావు గ్రంథాలయానికి బహూకరించారు. గ్రంథాలయాధికారి వి. అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బాలలంతా కథలను చదివి, వాటిని ఇతరులకు వివరించారు. యూత్ లీడర్లు కె.హేమంత్, సునీత, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

సబ్బవరం : పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయం అధికారి వి.శిరీష అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులతో నీతి కథలు చదివించారు. రిటైర్డ్ అధికారి రత్నకుమార్, 30 మంది విద్యార్థులు, పాఠకులు, పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాలపై గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పాటలు, ఆటలు, వ్యాచారచన పోటీలు నిర్వహించారు.

నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందు తుందన్నారు.

నర్సీపట్నంటౌన్: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం బాలల కథలను గ్రంథాలయాధికారిణి దమయంతి చదివించారు. కథను చదివించి, దానిలోని నీతిని వివరించారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు బి ఎస్ ప్రసాద్ తెలుగు పదాలు రాయడం, యాత్రలు రకాలో ప్రశ్నల ద్వారా అడిగి రాయించారు. పదాలు ఇంగ్లీషులో రాయించారు. తెలుగు పదాల ఆట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

హనుమంతువాక కూడలిలో ఆర్‌టిసి బస్సు బీభత్సం

- బలంగా ఢీకొట్టడంతో మూడు కార్లు, బైక్, ఆటో ధ్వంసం
- ప్రమాదంలో సాయం చేస్తున్నట్లు నటిస్తూ రెండు ఉంగరాల అపహరణ

ప్రజాశక్తి - ఆరిలోవ :హనుమంతు వాక జంక్షన్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక ఆర్‌టిసి బస్సు బీభత్సం సృష్టించింది . కార్లు, ఆటో, బైక్ ధ్వంసం అయ్యాయి. ఇద్దరు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీనికి సంబంధించి ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ మురళి తెలిపిన వివరాలివి.

హనుమంతు వాక సిగ్నల్స్ సమీపంలో విజయనగరం నుండి కుర్మన్నపాలెం వెళుతున్న ఆర్టీసీ బస్సు 111వి వేగంగా వచ్చి ఒక కారును బలంగా ఢీకొట్టింది. దీంతో వరుసగా మూడు కార్లు, ఒక ఆటో, ఒక బైక్ ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ఒక కానిస్టేబుల్ ఆయన కుమార్తె ఒకవైపుకు పడిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే వారి స్కూటీ పూర్తిగా ధ్వంసమైనట్లు ఎస్ఐ తెలిపారు.

సందట్లో సడేమియాలా ఉంగరాల చోరీ

ఈ రోడ్డు ప్రమాద ఘటనలో స్వల్పంగా గాయపడిన క్షతగాత్రులను పైకి లేపుతున్నట్లు నటిస్తూ వారి చేతికి ఉన్న రెండు బంగారపు ఉంగరాలు దుండగులు చోరీ చేశారు. ప్రమాదసమయంలో ఆందోళనలో ఉన్న బాధితులు అప్పట్లో గుర్తించలేకపోయినా, తర్వాత ఉంగరాల చోరీ జరిగినట్లు తెలుసుకుని ఆరిలోవ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సిఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -గాజువాక : ఫ్యాన్‌కు ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన గాజువాక వుడాకాలనీ టింపనీ స్కూల్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. న్యూపోర్ట్ పోలీసులు తెలిపిన వివరాలివి.

భానోజీ కాలనీకి చెందిన కొయిలాడు శ్రీనివాస్ (33) కొంతకాలంగా తన బావ ఎసిల మరమ్మతులు చేసే షాపులోనే పనిచేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో షాపులో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని చనిపోయాడు. మృతుని బావ యశోదకృష్ణ షాప్‌కు వచ్చి చూసేసరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే శ్రీనివాస్ తండ్రి రమణాజీకి సమాచారం అందజేశారు. ఆయన వచ్చి చూసి న్యూపోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వుడా కాలనీలో టింపనీ స్కూలు సమీపంలో ఎసి రిపేర్ షాపులో సోమవారం కొయిలాడు శ్రీనివాస్ అనే వ్యక్తి షాపులో ఉన్న ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు న్యూపోర్ట్ పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని కెజిహెచ్‌కు పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు న్యూపోర్ట్ పోలీసులు తెలిపారు.అయితే ఎలా చనిపోయిన విషయం తండ్రి ఫిర్యాదులో తెలియజేయలేదు.

యాచకురాలు మృత్యువాత

యాచకురాలి మృతదేహం

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక స్వగృహ ఫుడ్స్ పరిసరాల్లో ఐదేళ్లుగా సంచరిస్తూ బిచ్చ మెత్తుకుని జీవనం సాగించే మహిళ సోమవారం మృత్యువాత పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొన్నాళ్లుగా గాజువాక పరిసరాల్లో పగలంతా సంచరిస్తూ, రాత్రివేళ స్థానిక స్వగృహఫుడ్స్ దుకాణం వద్దకు చేరుకుని అక్కడ నిదురించే యాచకురాలు సోమవారం అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించేసరికి అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. ఐదేళ్లకుపైగా ఈ ప్రాంతంలోనే సంచరిస్తున్నప్పటికీ, ఆమె ఎవరు, ఎక్కడి నుంచి వచ్చిందనే సమాచారం ఇక్కడి వారికి తెలియని పరిస్థితి . పోలీసులు దీనిపై ఆరా తీసినప్పటికీ, ఎటువంటి ఆచూకీ తెలియకపోవడంతో మృతదేహాన్ని కెజిహెచ్ మార్చురీకి తరలించారు.దీనిపై కేసు నమోదు చేశారు.

గంభీరం రిజర్వాయర్‌లో పడి యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి -ఆనందపురం : గంభీరం రిజర్వాయర్ ప్రమాదవశాత్తు కాలుజారి పడడంతో యువకుడు దుర్మరణం పాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న విషాద ఘటనకు సంబంధించి వివరాలివి. నగరంలోని పిఎం పాలెం సమీప మారికవలస గ్రామానికి చెందిన సమీర్ (26) నలుగురు స్నేహితులతో కలిసి గంభీరం రిజర్వాయర్‌కు సరదాగాచేపల వేటకు వెళ్లాడు. చేపలు పడుతుండగా సమీర్ ప్రమాదవశాత్తూ జారి నీటిలో పడిపోయాడు. రిజర్వాయర్‌లో లోతు ఎక్కువగా ఉండటంతో, ఈత రాకపోవడం వల్ల సమీర్ నీటిలో మునిగి మృతి చెందాడు. గమనించిన తోటి స్నేహితులు, స్థానికుల సహాయంతో రిజర్వాయర్‌లోకి దిగి సమీర్‌ను వెతకడానికి ప్రయత్నించారు. అయితే ఫలితం లేకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి ఆనందపురం సిఐ సిహెచ్. వాసునాయుడు, ఎస్ఐ సంతోష్, తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డిఆర్‌ఎఫ్ బందంతో కలిసి చేరుకొని మృతదేహాన్నివెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ వాసునాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ వాసునాయుడు మాట్లాడుతూ రిజర్వాయర్ వద్ద ప్రమాదకర ప్రదేశాల్లో పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ, నిర్లక్ష్యంగా నీటిలోకి దిగడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రాణం తర్వాతే అన్నీ అన్న విషయాన్ని తెలుసుకుని ప్రజలు, ముఖ్యంగా యువత మెలగాలని సూచించారు.

విమ్స్‌లో వైద్యుల పోస్టులు భర్తీకి 29న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో 28 అసిస్టెంట్ ప్రొఫెసర్ వైద్యుల ఉద్యోగాల భర్తీకి ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ జారీ చేసిందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ ద్వారా ఎటువంటి రాత పరీక్ష లేకుండా, కేవలం ఉత్తీర్ణత శాతం అలాగే రూల్ ఆఫ్ రిజర్వేషన్ బట్టి ఉద్యోగాలను భర్తీ చేస్తారన్నారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న 28 వైద్యపోస్టుల భర్తీకు అర్హత కలిగిన వైద్యులు నేరుగా హాజరు కావచ్చన్నారు. స్పెషలిస్ట్ వైద్యులకు రూ.92వేలు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు రూ రూ.1.60లక్షల నెలసరి వేతనంతో నియామకాలు చేపడతారన్నారు. ఈనెల 29న ఉదయం 10గంటల నుంచి హనుమంతవాక దరి విమ్స్ ఆస్పత్రిలో ప్రారంభమయ్యే వాక్‌ఇన్ ఇంటర్వ్యూకు ఆసక్తిగల వైద్యులు తమ ఉత్తీర్ణత పత్రాలతో పాటు మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు http://dme.ap.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ఖాళీల వివరాలు

అనస్తీషియా-10, న్యూరో సర్జరీ-3, కార్డియాలజీ-2, ఎమర్జెన్సీ మెడిసిన్-2, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ (మెడికల్)-3, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ-1, మెడికల్ ఆంకాలజీ-1, ప్లాస్టిక్ సర్జరీ-1, ఎండోక్రైనాలజీ-1, పల్మనాలజీ-1, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ-1, జనరల్ మెడిసిన్ -2 మొత్తం 28 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు వెల్లడించారు.

సీతానగరం వాసికి అంతర్జాతీయ పురస్కారం

ఆర్యభట్ట పురస్కారాన్ని స్వీకరిస్తున్న బాబూరావు

ప్రజాశక్తి- గాజువాక : పెదగంట్యాడ మండలం, సీతానగరం గ్రామానికి చెందిన నమ్మి బాబూరావుకు మల్టీ టాలెంటెడ్ విభాగంలో అంతర్జాతీయ ఆర్యభట్ట పురస్కార వరించింది. ఆర్యభట్ట కల్చరల్ సంస్థ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా 16 దేశాలకు చెందిన వివిధ రంగాల ప్రముఖులను గుర్తించి పురస్కారాలను ప్రదానం చేయగా, నమ్మి బాబూరావుకు బాడీ బిల్డింగ్, కుంగ్‌ఫూ, కరాటే, యోగాలో 1996నుంచినిర్విరామంగా శ్రమిస్తూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సొంతం చేసుకోవడాన్ని గుర్తిస్తూ మల్టీ టాలెంటెడ్ విభాగంలో అంతర్జాతీయ పురస్కారానికి ఎంపిక చేసి అందజేశారు. బెంగళూరులో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో కర్ణాటక లా కమిషన్ చైర్మన్ డాక్టర్ అశోక్ బి.హించిగేరి, కర్ణాటక సాహిత్య పరిషత్ ప్రెసిడెంట్ డాక్టర్ మహేష్‌జోషి, ఆర్యభట్ట కల్చరల్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్‌హెచ్‌ఎల్‌ఎన్.రావు, తెలుగు హీరో రాంకీ, కన్నడ డైరెక్టర్ క్రాంతిప్రసాద్, సాయిమారుతి కనస్ట్రక్షన్స్ ప్రసాద్, బసవరాజు తదితరులు సమక్షంలో బాబూరావు అవార్డును స్వీకరించారు. అవార్డు గ్రహీత బాబూరావును పలువురు అభినందించారు.

టైపు రైటింగ్ పరీక్షలను ఆగస్టులోనే నిర్వహించాలి

ప్రజాశక్తి -తగరపువలస : టైపు రైటింగ్ పరీక్షలు ఈ ఏడాది ఆగస్టు నెలలో నిర్వహించాలని చిట్టివలస, శ్రీలక్ష్మి టైపు ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు, జిల్లా టైపు రైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ సభ్యులు బల్లా వెంకటరావు సోమ వారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ప్రతి ఆరు నెలలకు నిర్వహిస్తున్న టైపు రైటింగ్ పరీక్షలు ఎప్పటి వలెనే ఆగస్టులో నిర్వహిస్తే విద్యార్థులకు ఉపయోగమన్నారు. జూలై నెలలో టైపు రైటింగ్ పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

తొలగించిన కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలి

- స్టీల్‌ప్లాంట్ కాంటాక్ట్ కార్మికుల సమ్మెకు మద్దతుగా అఖిలపక్ష కార్మికుల ధర్నా

అఖిలపక్ష కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న అయోధ్యరాం

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు మద్దతుగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అడ్మిన్ బిల్డింగ్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా అయోధ్యరాం మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల సమస్య పరిష్కరించి, సమ్మె విరమింప చేయాలని కోరారు. వారు చేస్తున్న పోరాటం న్యాయమైందని, తక్షణమే కాంటాక్ట్ కార్మిక సంఘాల నాయకులను చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె వల్ల ఉత్పత్తి తగ్గుతోందన్నారు.

గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కెఎస్ఎన్ రావు మాట్లాడుతూ కార్మికుల పట్ల యాజమాన్యం అన్యాయంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులతో చర్చలు జరపాలని కోరినప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యంగా పట్టించుకోవడం లేదన్నారు.. ఇదే పద్ధతి కొనసాగితే కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి మద్దతుగా పర్మనెంట్ కార్మికులు ఇదే బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. స్టీల్ ఐఎన్‌టియుసి అధ్యక్షులు రమణమూర్తి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె వల్ల ప్లాంట్‌లో ఇతర అధికారులు, కార్మికులపై పనిభారం, ఒత్తిడి పెరుగుతోందన్నారు. ఇది అనేక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందన్నారు అటువంటిదేమైనా జరిగితే దానికి యాజమాన్యమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

సిఎఫ్‌టియుఐ నాయకులు డి. సురేష్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు తక్షణమే జోక్యం చేసుకొని కాంట్రాక్టు కార్మికులతో యాజమాన్యం చర్చలు జరిపేలా ఒత్తిడి చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికుల సమ్మె నేపథ్యంలో యాజమాన్యం ఇతర కార్మికుల పనిగంటలను పెంచి, వారితో 12 గంటలపాటు పనిచేయించుకుని ఇబ్బందులు పాల్జేయడం సరికాదన్నారు. తక్షణమే కాంట్రాక్టు కార్మికుల సమ్మె నివారణకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు వైటి దాస్, కొమ్ము ప్రసాద్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మా మాస్టార్లను బదిలీ చేయొద్దు

- ఎంఇఒకు చిన్నాపురం గ్రామ విద్యార్థులు, తల్లిదండ్రుల వినతి

ఎంఇఒ కార్యాలయానికి వచ్చిన చిన్నాపురం గ్రామస్తులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని చిన్నాపురం మండలపరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆర్ సునీత, ఎ.ఆదిబాబులను బదిలీ చేయొద్దని ఈ గ్రామ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మొరపెట్టుకుంటున్నారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయానికి వచ్చి ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. చిన్నాపురం పాఠశాలలో సునీత, ఆదిబాబులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతోకూడిన నాణ్యమైన విద్యాబోధనను అందిస్తున్నారని వారంతా అంటున్నారు. వారు బాధ్యతలు చేపట్టిన తర్వాత పాఠశాల రూపురేఖలు మారిపోయాయని, ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ఇక్కడ విద్యాబోధన సాగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఉపాధ్యాయ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో అలాంటి ఉపాధ్యాయులను వదులుకోవడం గ్రామంలో ఎవరికీ ఇష్టం లేదని, వారిని బదిలీ చేయకుండా యథావిధిగా తమ పాఠశాలలోనే కొనసాగించాలని వారంతా వేడుకున్నారు. కాదు, కూడదని బదిలీ చేస్తే తామంతా ఆందోళన చేయక తప్పదని హెచ్చరిస్తున్నారు.

గ్రాస్‌రూట్స్ ఫుట్‌బాల్ విజేత శ్రీకాకుళం

విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -తగరపువలస : మధురవాడలోని శాప్ గ్రౌండ్‌లోఇటీవల నిర్వహించిన గ్రాస్‌రూట్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ 2025 విజేతగా శ్రీకాకుళం ఫుట్‌బాల్ క్లబ్ జట్టు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. రన్నర్స్‌గా అన్వర్ బాయ్స్ జట్టు నిలిచిందన్నారు. 14 ఏళ్ల లోపు బాలురు, బాలికల ఉత్తరాంధ్ర జోనల్ టోర్నమెంట్‌లో మొత్తంగా 16 జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. ఆద్యంతం ఉత్సాహంగా సాగిన పోటీల ఫైనల్‌లో శ్రీకాకుళం, అన్వర్ బాయ్స్ జట్లు చేరగా, శ్రీకాకుళం జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ట్రోఫీలు, బహుమతులను నిర్వాహకులు అతిథులు అందజేశారు

ఆకట్టుకున్న ఎయు విద్యార్థుల చిత్రకళా ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులు తమ ప్రతిభతో ఉన్నతంగా రాణించాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. .సోమవారం ఉదయం ఎయు చిత్రకళా విభాగంలో బిఎఫ్ఎ, ఎంఎఫ్ఎ విద్యార్థులు ఏర్పాటుచేసిన వార్షిక చిత్రకళా ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఆంధ్రవిశ్వకళా పరిషత్‌లో ఉన్నతవిద్యను

చిత్రకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ నరసింహారావు

చిత్రకళా ప్రదర్శనను తిలకిస్తున్న చిన్నారులు

అభ్యసించడం విద్యార్థులకు గర్వకారణమన్నారు. .విద్యార్థులు సృజనాత్మకత, నైపుణ్యాలతో అద్భుతమైన కళాఖండాలను తీర్చిదిద్ది ప్రదర్శించడంపై సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇక్కడ నేర్చుకున్న అంశాలను కార్యరూపంలో చూపుతూ తీర్చిదిద్దిన శిల్పాలు, చిత్రాలు అత్యుత్తమంగా నిలుస్తున్నాయన్నారు.

విభాగాధిపతి డి.సింహాచలం మాట్లాడుతూ వచ్చేనెల ఒకటో తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు చిత్రకళా ప్రదర్శన ఉంటుందన్నారు. విద్యార్థులు తయారుచేసిన శిల్పాలు, కళారూపాలు, చిత్రాలు ప్రదర్శిస్తామన్నారు. నగరవాసులు, చిత్రకళా ప్రియులు పెద్దసంఖ్యలో వచ్చి ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించాలని కోరారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు శిష్టాశ్రీనివాస్, విశ్రాంత ఆచార్యులు వి.రమేష్, ఎం.ఆదినారాయణ, టి.సుధాకరరెడ్డి, బి.మహేశ్వరదాస్, మయూఖ కుమారి దేవీ తదితరులు చిత్రకళా ప్రదర్శనను సందర్శించి విద్యార్థులను అభినందించారు.

రూపొందించిన కళారూపాలను ప్రదర్శిస్తున్న విద్యార్థిని

జిల్లా పారిశ్రామికాభివృద్ధికి చర్యలు

- పరిశ్రమలలో భద్రత ప్రమాణాలు పాటించాలి
- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి, పరిశ్రమల స్థాపనకు అవసరమైన చర్యలు సత్వరమే తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) జిల్లా స్థాయి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏకగవాక్ష విధానం కింద గత ఏప్రిల్ 15న జరిగిన సమావేశం నుండి ఇప్పటివరకు 299 దరఖాస్తులు వివిధ శాఖల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగ వాటిలో 239 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల అనుమతుల వివరాలను వివిధ శాఖల అధికారులతో మాట్లాడి నిర్ణిత సమయంలో ఆమోదించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా జిల్లాలో 21 పరిశ్రమలకు సంబంధించిన వివిధ రాయితీల కొరకు 28 దరఖాస్తులకు గాను రూ.1.72 కోట్లు కమిటీలో ఆమోదం తెలిపామన్నారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన, ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాల అమలు తీరు, పురోగతిపై సమీక్షించారు. సురక్షిత తనిఖీ -ప్రమాదకర, హానికర పరిశ్రమల తనిఖీలపై సమీక్ష నిర్వహించారు. 2024 అక్టోబర్ 1 నుండి ఇప్పటి వరకు మొత్తం 196 పరిశ్రమలకు గాను 176 పరిశ్రమలకు తనిఖీలు చేయడం జరిగిందన్నారు. తనిఖీలలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు ఆ పరిశ్రమలకు 485 పని తీరు మెరుగుదల సూచనలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఏపిఐఐసి వారు నూతనంగా మంజూరు చేయబోవు స్థలాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆది శేషు, ఏపిఐఐసి డిజిఎమ్ రాజశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ ముకుందా రావు, జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ విజయ క్రిష్ణన్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం నుంచి మండలాల్లో, గ్రామ, వార్డ్ సచివాలయ స్థాయిలో యోగాభ్యాస కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. మే 27 తేదీన పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం బీచ్ పర్యాటక ప్రాంతం వద్ద, జూన్2న గొలుగొండ మండలం కె.డి.పేట ఎస్ఆర్ పార్క్ వద్ద, జూన్ 9న రాంబిల్లి మండలం ధనదిబ్బలో బుద్ధిష్ ప్రాంతం వద్ద, జూన్ 15న ఎస్ రాయవరం మండలం రేవుపోలవరం బీచ్ వద్ద, జూన్ 10న దేవరపల్లి మండలం రైవాడ రిజర్వాయిర్ వద్ద, జూన్ 18న చోడవరంలోనూ, 20న అనకాపల్లి బొజ్జన్న కొండ వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి చోటా 1000 మంది హాజరయ్యే విధంగా సమన్వయం చేసుకోవాలని కోరారు. పేరును https://yogandhra.ap.gov.in/#/home/yoga-registration లింక్ ద్వారా నమోదు చేసుకుని పాల్గొన వచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారిణి కె.మనోరమ, జిల్లా ఆయుష్ అధికారి కే.లావణ్య, ఎంపీడీఓలు, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసిన అనంతరం మహిళలకు ప్రభుత్వం కుట్టు మిషన్లను పంపిణీ చేస్తుందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. మండలంలో 144 మంది మహిళలకు కుట్టుమిషన్లు మంజూరు చేస్తే 80 మంది మహిళలు శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పి.పద్మజ, వైస్ ఎంపీపీలు శరగడ రూప్లీలక్ష్మీ రాణి రాము, మామిడి లక్ష్మి కొండాజీ, కూటమి నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు, ఇందల వెంకటరమణ, కర్రి కనకరాజు, గండి దుర్గాప్రసాద్, చొక్కాకుల గోవింద్, బంతికోళ్ల పద్మ, బలిరెడ్డి రామకృష్ణ, బయలుపూడి దేముడు, మామిడి శంకర్రావు, గొర్లి కుమార్, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, కొల్లి కృష్ణ, మంగరాజు, కర్రి నరసింగరావు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ పనులు కొనసాగించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడకలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ పనులను కొనసాగించాలని కోరుతూ మత్స్యకారులు సోమవారం ఆందోళన చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక హార్బర్ పనులు నిలిపివేశారని పేర్కొన్నారు. ఇది నిర్మాణం జరగకకపోతే మత్స్యకారులు ఉపాధి అవకాశాలకు దూరమైపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ దీనిపై స్పందించి ఫిషింగ్ హార్బర్ పనులను జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి ఉమ్మడి జగన్, నాయకులు ఉమ్మడి అప్పారావు, దూడ మసేను, గనగల దేవుడు, వై శ్రీను, చోడిపిల్ల అచ్చియ్య, మైలిపిల్లి పోలయ్య, ఉమ్మడి అప్పలరాజు, పోలయ్య పాల్గొన్నారు.

సమస్యలను సంఘటితంగా ఎదుర్కోనాలి

మహిళలకు ఐద్వా రాష్ట్ర నాయకులు రమాదేవి, పద్మ పిలుపు

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర నాయకులు పద్మ

ప్రజాశక్తి-మునగపాక

నేటి ప్రభుత్వాల విధానాల ఫలితంగా మహిళలు అనేక సామాజిక ఆర్థిక సమస్యలకు గురవుతున్నారని, వాటిని మహిళలంతా సంఘటితంగా ఎదుర్కోనాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలోని డావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్లో మహిళా చైతన్య శిక్షణ తరగతులు సోమవారం ముగింపు సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వాలు పెట్టుబడిదారులు, వ్యాపారుల లాభాలకు పెద్ద పీట వేయడం వల్లే అన్నింటి ధరలు పెరుగుతున్నాయని తెలిపారు. ఉపాధి లేక తక్కువ వేతనాలకు మహిళలు అధిక శ్రమ చేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కొరకు జరుగుతున్న సమ్మెకు ఐద్వా సంపూర్ణ మద్దతు ఇస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. 100 రోజుల్లో గంజాయి లేకుండా చేస్తామన్న మాటలు నీటిమూటలుగానే ఉన్నాయన్నారు. పొదుపు మహిళలకు ఇంత వరకు వడ్డీ రాయితీ అమలు చేయలేదన్నారు. రోజూవారీ ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ప్రయత్నం చేస్తూనే రాజకీయ, ఆర్థిక విధానాల వల్ల వచ్చే దుష్పరిణామాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు అలరించాయి. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి. ప్రభావతి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు వై సత్యవతి, అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, డిడి వరలక్ష్మి, నాయకులు పూర్ణ, రమణి, ఆర్.లక్ష్మి, వాణి, జి సుభాషిణి, సిహెచ్ మంగతాయారు, ఎల్.గౌరి, కెవి.సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.)లో వచ్చిన అర్జీలు నిర్ణిత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయక్రిష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, పత్యేక డిప్యూటి కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం పరిష్కారం కాని అర్జీలపై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు, డిపిఒ శిరీష రాణి, మెప్మా పీడీ సరోజినీ, జిల్లా అబ్కారీ శాఖ అధికారి వి.సుధీర్, జిల్లా సర్వే భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్ వెంకటరమణ పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో 40 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 40 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలు చీటింగ్ తదితర అంశాలు ఉన్నాయి. ఎస్పీ స్వయంగా హాజరై ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వారితో ప్రత్యక్షంగా మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్సై డి.వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

1 నుండి రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జూన్ 1వ తేదీ నుండి నిత్యవసర సరుకులు చౌక ధరల దుకాణాల ద్వారానే పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా ప్రజాపంపిణీ అధికారి కెవిఎల్ఎన్.మూర్తి తెలిపారు. సోమవారం పౌరసరఫరాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మొబైల్ వాహనాల ద్వారా ఇంటింటికి సరుకులు పంపిణీ ప్రభుత్వం రద్దు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని 1069 చౌక ధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఒకటో తేదీ నుండి 15వ తేదీన లోపల కుటుంబంలోని ఎవరైనా వెళ్లి సరుకులు పొందవచ్చని తెలిపారు. చౌక ధరల దుకాణాలు ఉదయం 8 నుండి 12 గంటలు వరకు, మధ్యాహ్నం 4 నుండి 8 గంటల వరకు పనిచేస్తాయని, ఆ సమయంలో లబ్దిదారులు సరుకులు తీసుకోవాలని కోరారు. 65 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 నుండి 4 గంటల సమయంలో వారి ఇంటి వద్దకే సరుకులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులు రాష్ట్రంలో ఏ చౌక ధరల దుకాణం నుంచైనా వారి సరుకులు పొందవచ్చునని తెలిపారు. రేషన్ కార్డులు మార్పులు చేర్పులు, ఏడు అంశాలకు సంబంధించి సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు 21వేల దరఖాస్తులు అందాయని, వాటిని నిర్దిష్ట గడువు 21 రోజులలో పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తేగాడ గ్రామం సచివాలయం రైతు సేవా వద్ద 50 శాతం సబ్సిడీతో రైతులకు పశు దాణా సోమవారం పంపిణీ చేశారు. మండల పశు వైద్యాధికారి ఆల్ఫాన్స్ జార్జ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి, కూటమి నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ, సిదిరెడ్డి సూర్యనారాయణ అద్దేపల్లి బాబూరావు, వేగి రామ కోటేశ్వరరావు, రావి చంటి, బలిజి ముసిలినాయుడు, గొంతిని ఈశ్వరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి ఐక్యంగా పని చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి వైఎస్సార్సీపీని మరింత బలోపేతం చేసేందుకు అందరం కలిసికట్టుగా పని చేద్దామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతి అన్నారు. మండలంలోని తారువలో వైసిపి మాడుగుల నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం సోమవారం మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. ఈ నెలాఖరులోగా మండల కమిటీలను, జూలై నెలాఖరిలోగా గ్రామ కమిటీలను, సెప్టెంబర్ నెలాఖరులోగా బూత్ కమిటీల నియామక ప్రక్రియను ఏకాభిప్రాయంతో పూర్తి చేయాలని సూచించారు. పార్టీ సభ్యత్వం కలిగిన ప్రతీ ఒక్కరికి గుర్తింపు కార్డుతో పాటు ఉచిత బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లే అనురాధ, పార్టీ నాయకులు సేనాపతి కొండలరావు, వరదపురెడ్డి లలితానాయుడు, సోలం రమేష్, కెవి.రమణ, ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, రెడ్డి జగన్మోహన్, తాళ్లపురెడ్డి రాజారామ్, కురచా జయమ్మ, జెడ్పీటీసీలు కర్రి సత్యం, కిముడు రమణమ్మ, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పంచాద సింహాచలంనాయుడు, పొలిమేర విజయలక్ష్మి, కొత్తపల్లి శ్రీనివాస్, రొంగలి సూర్యనారాయణ, ధర్మిశెట్టి స్వాతి, కిముడు చినమ్ములు, పార్టీ మండల అధ్యక్షులు బూరె బాబురావు, గొల్లవిల్లి రాజుబాబు, యువజన అధ్యక్షులు కర్రి సూరినాయుడు, గొల్లవిల్లి స్వామినాయుడు, గొర్రపోటు వెంకటరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శోభా హైమావతి

పాఠశాలలో కలిసిన బయ్యవరం హైస్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బయ్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం పాఠశాల వేదికగా కలుసుకున్నారు. ఒకరినొకరు అపాయ్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాడు తమకు విద్యాబుద్ధులు చెప్పిన ప్రధానోపాధ్యాలుయులు వైద్యనాథం, ఉపాధ్యాయులు కృష్ణారావు, ఆనందరావు, నాగకుమారి, నాగలక్ష్మి, కేశవరావు, పార్వతీదేవి, చల్లారావు, జోగినాయుడు తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఆర్ సీతాపతి, ఏ.మధుబాబు, కె హరి, కే వెంకన్న, సీహెచ్ శ్రీను, జి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు..

డైట్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-అనకాపల్లి : డైట్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఏఐసిటిఈ అటల్ -ఎడ్యు స్కిల్స్ సహకారంతో నిర్వహించారు. ఈసిఈ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో 'అన్సిస్ ఎలక్ట్రోమాగ్నెటిక్ ఎనాలసిస్" పై జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నెల 26 నుండి 31 వరకు నిర్వహిస్తున్నారు. యాంటీనాస్, ఎలక్ట్రిక్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పీసీబీ డిజైన్ రంగాలలో ఉన్న అకాడెమిక్స్, పరిశోధకుల కోసం అన్సిస్ ఎలక్ట్రానిక్ డెస్కాప్(ఏఈడిటి) పై సమగ్ర జ్ఞానం, ప్రాయోగిక అనుభవాన్ని అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఇందులో మిస్టర్ ప్రభుపాదసమల్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. వైకుంఠ రావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గణేశ్ ప్రసాద్ రెడ్డి, ఈసీఈ డిపార్ట్మెంట్ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణ ప్రియ, డాక్టర్ జి.వి.శ్రీధర్ పాల్గొని మాట్లాడారు.

90 శాతం సబ్సిడీపై విత్తనాలు, పురుగు మందులు ఇవ్వాలి

ప్రజాశక్తి-చోడవరం : ప్రభుత్వం రైతులకు 90 శాతం సబ్సిడీపై పురుగు మందులు. విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపలి అప్పలరాజు మండల వ్యవసాయ అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నకిలీ పురుగు మందులు, విత్తనాల వల్ల రైతులు పూర్తిగా నష్టపోతున్నారని, వాటిని అమ్మే వ్యాపారస్తులపై చర్యలు చేపట్టి క్రిమినల్ కేసులు పెట్టాలని, పిడి యాక్ట అమలు చేయాలని కోరారు. నకిలీల వల్ల ఆర్థికంగా నష్టపోతున్న రైతులు పెట్టుబడుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక రైతులు ఆత్మహత్యలు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులు. చిత్తశుద్ధితో వ్యవహరించి కల్తీ పురుగుమందులు విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పత్తి సత్తిబాబు, సింగంపల్లి దేవుడు, జోగా శంకర్రావు, రైతులు పాల్గొన్నారు.

ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మండలంలో జరుగుతున్న ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలపై విశాఖపట్నం ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పికి జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్ రాజు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ చోడవరం మండలంలో ప్రభుత్వం అనుమతిచ్చిన అధికారిక క్వారీలు లేవని, అయినప్పటికీ, శారదా నదీ తీరంలో అనధికారికంగా పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా శేమునాపల్లి, గవరవరం, లక్కవరం, వెంకన్నపాలెం, నరసాపురం, రాయపురాజుపేట, గజపతినగరం, జుత్తాడ, భోగాపురం, అంబేరుపురం వంటి గ్రామాల్లో ఈ అక్రమ తవ్వకాలు ఉధృతంగా సాగుతున్నాయని వివరించారు. విజిలెన్స్ విభాగం ద్వారా నిష్పక్షపాతంగా, సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

కలెక్టరేట్ వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేసి అమ్మకాలు చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ప్రాజెక్ట్ అధికారి లచ్చన్న, అనకాపల్లి జిల్లా మార్కెటింగ్ అధికారి వర్మ , మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్స్ అప్పలరాజు, శివ, వాసు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డోలీ మోతలను అరికట్టాలి

- గిరిజన గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేయాలి
- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

గిరిజన గ్రామాలకు రహదారుల సౌకర్యం కల్పించి డోలీ మోతలను అరికట్టాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా గ్రామాలకు వాహనాలు, అంబులెన్స్‌లు కూడా వెళ్లడానికి రోడ్లు సౌకర్యాల్లేక ప్రాణాలు కోల్పోతున్న దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం మైళ్ల కొద్దీ దూరం డోలీల్లో మోసుకెళ్లాల్సిన దుస్థితి ఉందని, మార్గ మధ్యలోనే మతి చెందిన సంఘటనలు కోకొల్లలు అని పేర్కొన్నారు. తాజాగా దేవరాపల్లి మండలం బోడిగరువు ఆదివాసీ గ్రామానికి చెందిన మహిళను ఐదు కిలోమీటర్లు దూరం డోలికట్టి మోసుకువచ్చారని, బలిపురం గ్రామానికి ఐదు సంవత్సరాల చిన్నారి చనిపోతే మృతదేహాన్ని చేతులపై మోసుకొని వెళ్ళారని, అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని మంద్రాబులో రెండు నెలలు చిన్నారి కేజీహెచ్‌లో చనిపోతే 20 కిలోమీటర్లు చేతులపై మోసుకొని వెళ్ళారని, ఇదే మండలం పెద్దకోట పంచాయతీ కొండశిఖర గ్రామంలో అనారోగ్యానికి గురైన మహిళను 9 కిలోమీటర్లు డోలితో మోసుకెళ్లారని తెలిపారు. గత నెలలో విజయనగరం జిల్లాలో యస్ కోట మండలం రేగపుణ్యగిరి నుంచి డోలీలో మోసుకెళుతున్న గర్భిణి మార్గమధ్యలోనే బిడ్డకు జన్మనిచ్చిందని పేర్కొన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనారోగ్య సమయంలోనూ, గర్భిణుల ప్రసవ సమయంలోనూ డోలీ మోతలు సర్వసాధారణమయ్యాయని, మైదాన ప్రాంతాల్లో మరణిస్తే మృతదేహాలను తమగ్రామాలకు తీసుకెళ్లడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని ప్రతి పౌరుడికీ వైద్యం ప్రాథమిక హక్కు అని, కాని గిరిజన ప్రజలకు మాత్రం అది అందని ద్రాక్ష అని పేర్కొన్నారు. అమృతోత్సవాలు, గిరిజనోత్సవాలు నిర్వహిస్తున్న ప్రభుత్వాలు ఒక్క డోలీమోత లేకుండా, ఒక్క చావు లేకుండా ఆపగలిగాయా? అని ప్రశ్నించారు. పాలకులకు గిరిజనుల ఓట్లపై ఉన్న శ్రద్ధ, వారి అభివృద్ధిపై లేదన్నారు. ఇప్పకైనా ప్రభుత్వాలు స్పందించి మారుమూల గ్రామాల ప్రజలు బయట ప్రపంచానికి రాకపోకలు సాగించడానికి అవసరమైన రహదారులు నిర్మించాలని, వైద్య సౌకర్యాలు అందించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

పొంగిప్రవహిస్తున్న గెడ్డలో డోలీ మోతతో గర్భిణిని తీసుకొస్తున్న గిరిజనులు (ఫైల్‌ఫోటో)

విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల నిరవధిక సమ్మెను పరిష్కరించాలి

కలెక్టర్‌కు అఖిల పక్ష కార్మిక సంఘాల వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు యాజమాన్య అక్రమ తొలగింపుకు వ్యతిరేకంగా గత 6 రోజుల నుండి చేస్తున్న నిరవధిక సమ్మెను పరిష్కరించాలని సోమవారం అఖిల పక్ష కార్మిక సంఘాలు కలెక్టర్‌కు విన్నవించాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.దొరబాబు, సీఐటీయూ జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, పిఎన్‌వి పరమేశ్వరరావు, ఏఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు కె.మోహన్ తదితరులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌లో ఇప్పటికే 1700 మందిని తొలగించారని, వర్క్ టెండర్లను రెన్యువల్ చేయకుండా మరో 1500 మందిని నిలుపుదల చేశారని తెలిపారు. అలాగే 1200 మంది పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరతో తొలగించారని, ఇప్పుడు మరో 3000 మంది కాంట్రాక్టు కార్మికులకు తొలగించటానికి పేర్ల లిస్టును సిద్ధం చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాలను రక్షించుకోవడానికి 12వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఈ సమ్మెను అణిచివేయటానికి పెద్దఎత్తున పోలీస్ బలగాలను మోహరించి, కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని డ్యూటీలకు వెళ్లాలని ఒత్తిడి చేయడం, భయపెట్టడం, అక్రమ కేసులు పెడతామని హెచ్చరించడం, అక్రమంగా అరెస్టులు చేయడం వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల్లో ఎక్కువ మంది స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి వేల ఎకరాలు భూములను త్యాగం చేసిన నిర్వాసితులని గుర్తు చేశారు. స్టీల్ యాజమాన్యం, కార్మిక సంఘాలు, కాంట్రాక్ట్ కార్మికుల చర్చించి సమ్మెను పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రం కాపీలను చూపుతున్న కార్మిక నేతలు

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

యోగా చేస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా, పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని, అనకాపల్లి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రత్యేక యోగా శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నెల రోజులపాటు నిర్వహించనున్న ఈ యోగాంధ్ర - 2025 కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి జిల్లా పోలీసు శాఖ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా ఆయుష్ డిపార్ట్మెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.లావణ్య, యోగా గురువులు శ్రీను, చంద్రిక, శివ, సతీష్, జగన్ తదితరుల మార్గదర్శనంలో అధికారులు, సిబ్బంది యోగా అభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు బి.మోహనరావు, పి.శ్రీనివాసరావు, వి.విష్ణు స్వరూప్, పోలీసు ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ్ మూర్తి, బెండి వెంకటరావు, బాల సూర్యారావు, లక్ష్మీ, గఫూర్, రమేష్, రామకృష్ణ, మన్మధరావు, సిఐలు, ఎస్సైలు, సివిల్, ఏఆర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా గురువు సతీష్‌కు సత్కారం

చోడవరం : చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రం గురువు పుల్లేటి సతీష్‌ను అనకాపల్లి జిల్లా ఎస్పీ సోమవారం సత్కరించారు. అనకాపల్లి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా ఆయుష్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ డిపార్ట్మెంట్ వారందరికీ సతీష్ యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సతీష్‌తో పాటు యోగ గురువులు శ్రీను, చంద్రిక, జగన్‌లను ఎస్పీ సత్కారించారు.

సబ్బవరం : యోగా శిక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక ఎంపీడీవో పి పద్మజ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 27 నుండి 31వ తేదీ వరకు సుమారు 250 మంది ప్రభుత్వ ఉద్యోగులను ఎంపిక చేసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

పద్మనాభం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిడిఒ ఎం.విజయకుమార్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, ఉపాధి హామీ, మండల పరిషత్ సిబ్బంది, విఆర్‌పిలు పాల్గొని యోగాసనాలు వేశారు.

పద్మనాభంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం యోగాంధ్రపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో డి సీతారామరాజు, తహసిల్దారు నరసింహమూర్తి, ఆయుష్ డాక్టర్ కే రఘు, ఎంఈఓ కే నరేష్, తెలుగు ఉపాధ్యాయులు ఎన్ వీ ఎస్ ఆచార్యులు, యోగా గురువు దవరసింగి రాంబాబు, ఉపాధ్యాయులు అప్పలరాజు, రవి పాల్గొన్నారు.

మాడుగుల : ప్రతీ సచివాలయం పరిధిలో యోగపై శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో కొంకి అప్పారావు పేర్కొన్నారు. యోగాపై ఒక్కో సచివాలయ ఉద్యోగి 150మందికి శిక్షణ ఇచ్చే విదంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగపై శిక్షణ ఇచ్చారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లి మండలంలో దొంకాడలో దళితులపై దాడి చేస్తున్న వారిని తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా కు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దొంకాడ దళితుల పై దాడి జరిగి 9 రోజులు అవుతున్నా నేటికి నిందితులను అరెస్టు చేయకపోవడం అన్యాయం అన్నారు. దాడికి గురైన బాధితులు ఇచ్చిన ఫిర్యాదుకు తగ్గట్టుగా ఎఫ్ఐఆర్‌లో సెక్షన్లు నమోదు చేయకుండా, నిందితులను కాపాడే విధంగా ఎఫ్ఐఆర్‌లో బెయిలబుల్ సెక్షన్లు వేయడం జరిగిందన్నారు. ఇలా అయితే బాధితులకు న్యాయం ఎలా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి జరిగిన రోజు నుండి దళితులు పనులకు వెళ్ళడానికి అవకాశం లేక ఆదాయం లేక పస్తులతో జీవిస్తున్నారని, వెంటనే ప్రభుత్వం దళితులకు బియ్యం, నిత్యావసర వస్తువుల ఇచ్చి ఆదుకోవాలని కోరారు.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ దళితులు పై దాడి జరిగిన దానిని నిష్పక్షపాతంగా విచారణ చేపడతామని చెప్పి నట్లు నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో రవి సిద్దార్థ, రాజు బాబు, బి.వెంకట రమణ, ఎం.అప్పలరాజు, చిరంజీవి, లోవరాజు, దొరబాబు, రాము, అప్పారావు, కన్నారావు, శివ, ఆనందరావు, స్వర్ణ రాజు, మురళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పికి వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు, బాధితులు

వితంతు పింఛన్లు మంజూరు చేయరూ...

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రభుత్వాలు ఎన్ని మారినా సామాన్య నా బతుకులు ఆశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతూ ఉంటుంది, అందుకు ప్రధాన ఉదాహరణ ప్రభుత్వం ఇటీవల వితంతు పింఛన్లకు ఇచ్చిన మెమో కారణంగా భర్త చనిపోయిన కొంతమందికే పింఛన్లు రావడం, మరి కొంతమందికి రాకపోవడం పట్ల అర్హుల్లో తీవ్రమైన గుబులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండల వ్యాప్తంగా చూస్తే సుమారుగా 158 వరకు వితంతు పింఛన్లు ఉంటాయని మండల పరిషత్ అధికారులు తెలిపారు. గత వైసిపి పాలనలో ఏడాదిన్నర కాలంగా వితంతు పింఛన్లు మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు తరువాత 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 1 వరకు మాత్రమే మంజూరు చేయడం పట్ల పింఛనుకు అర్హులైన వారితోపాటు వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబానికి భర్త ఆసరా కరువైనప్పుడు ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. ఇటువంటి తరుణంలో ఎటువంటి ఆసరా లేకుండా సుమారు ఏడాదిని కాలంగా పింఛను అందుతుందని ఆశగా ఎదురుచూస్తున్న తరుణంలో 2023 నుంచి 2024 వరకు మాత్రమే మెలిక పెట్టడం అనేది జీర్ణించుకోలేకపోతున్నారు. ఇటువంటి వితంతు పింఛన్లు అందుకునే వారిలో ప్రధానంగా వృద్ధులతో పాటు సామాజికంగా వెనకబడిన మహిళలు ఎక్కువగా ఉంటారు.వారికి పోషణ తో పాటు వైద్యం కోసం ఇతరులపై ఆధారపడకుండా ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంటుంది. ఇటువంటి తరుణంలో అర్హులందరికీ వితంతు పింఛన్లు అందే విధంగా చర్యలు చేపట్టాలని ప్రతిపక్ష నాయకులతో పాటు అధికార పార్టీ నాయకులు కూడా కోరుకుంటున్నారు.

ఏడాదిన్నర కాలంగా ఎదురు చూస్తున్నాం

ఏడాదిన్నర కాలంగా వితంతు పింఛను అందుతుందని ఎదురు చూస్తూ ఉన్నాను. గతంలో మంజూరు చేసుకున్న వారికి కాకుండా ఇటీవల దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఇవ్వడం దారుణం. వెంటనే న్యాయం చేయాలి.

వేములూరి రాజులమ్మ
అన్నవరం

ప్రభుత్వం స్పందించాలి

పింఛను అందుతుందని జూలై 23న దరఖాస్తు చేసుకున్నాం. నేటి వరకు కనీసం ఎవరు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని ఆశిస్తే ఈ ప్రభుత్వంలో కూడా అన్యాయ మే జరిగేటట్టు ఉంది.

కొల్లి చిట్టమ్మ
అన్నవరం

మహానాడుకు వెళ్లిన తెలుగు తమ్ముళ్లు

మాడుగులలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న తాతయ్యబాబు

ప్రజాశక్తి- మాడుగుల:కడపలో ఈనెల 27,28, 29 తేదీల్లో నిర్వహించనున్న మహా నాడు కార్యక్రమానికి మాడుగుల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, జిల్లా పార్టీ అధ్యక్షులు బత్తులతాతయ్య బాబు సమక్షంలో తరలి వెళ్లారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, తెలుగు యువత అధ్యక్షుడు రాజ్ కుమార్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి నందారపు సన్యాసిరావు, వమ్మలి సర్పంచ్ సింహాచలం నాయుడు, జంపెన గ్రామ శాఖ అధ్యక్షుడు కొండలరావు, పొంగలిపాక గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి కర్రం పోతురాజు, వమ్మలి గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి కరణం దేవుళ్ళు ఉన్నారు.

నక్కపల్లి:మహానాడు కార్యక్రమానికి నక్కపల్లి మండలంలో పలు గ్రామాల నుండి టీడీపీ శ్రేణులు తరలి వెళ్లారు. తెలుగుదేశం పార్టీ పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పుశెట్టి వెంకటేష్, మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు పార్టీ జెండాను ఊపి ప్రారంభించారు. బస్సులు, కార్లలో టిడిపి శ్రేణులు బయలుదేరి వెళ్లారు.

కోటవురట్ల:మహానాడు కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు లింగన్న నాయుడు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు వేచలపు జనార్ధన్ వెళ్లారు.

నర్సీపట్నంటౌన్:టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యాన రెండు ఏసీ బస్సులను నర్సీపట్నం పట్టణం నుండి బయలు దేరాయి.

రావికమతం:మహానాడుకు రావికమతం మండలం నుంచి భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు బయలుదేరారు. రావికమతం మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు రాజన కొండ నాయుడు ఆధ్వర్యంలో రెండు బస్సులలో తరలివెళ్లారు.

బుచ్చెయ్యపేట, వడ్డాది : మహానాడుకు బుచ్చయ్యపేట మండలం నుండి పెద్ద సంఖ్యలో టిడిపి శ్రేణులు బయలుదేరి వెళ్లాయి.. ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో భారీ కాన్వాయ్‌తో బయలుదేరారు. డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి వియ్యపు అప్పారావు, టిడిపి నేతలు జి కోటేశ్వరరావు, కోరుకొండ రవికుమార్, తమరాన దాసు, దొడ్డి కిషోర్, దొండా నరేష్, గోన్నాబత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కశింకోట : టిడిపి మహానాడుకు మండల నుండి టిడిపి నాయకులు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో టిడిపి నేతలు గొంతిన శ్రీనివాసరావు, ఉల్లింగల రమేష్, యన్ రమణారావు, ఆంధ్ర ప్రసాద్, నక్కా సాయి, నారిపల్లి ప్రసాద్, కుమార్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట
నుంచి వెళుతున్న నేతలు

సబ్బవరం : పెందుర్తి నియోజకవర్గ టిడిపి కార్యాలయం నుండి బస్సుల్లో టిడిపి నేతలు బయలుదేరారు. మొగలిపురం ఎంపిటిసి తమరాణ బంగారునాయుడు, బంగారమ్మ పాలెం సర్పంచ్ దాడి కన్నం నాయుడు జెండా ఊపి ప్రారంభించారు, కార్యక్రమంలో పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : టిడిపి అనకాపల్లి మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో టిడిపి మహానాడుకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కరణం శ్రీనివాసరావు దండుపాటి గంగరాజు బత్తుల రమేష్ మొయ్య నూకరాజు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో రెండు బస్సులు, 30 కార్లలో మహానాడుకు తరలివెళ్లారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబు జెండా ఊపి ప్రారంభించారు.

భీమునిపట్నం : కడపలో ఈ నెల 27, 28,29 తేదీల్లో జరగనున్న టిడిపి మహానాడుకు మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తెలుగుదేశం శ్రేణులు సోమ వారం వివిధ వాహనాల్లో బయల్దేరారు. జెడ్పిటిసి గాడు వెంకట ప్పుడు, మాజీ జెడ్పిటిసి సరగడం అప్పారావు, సింగనబంద సర్పంచ్ జివి నారాయణ, నాయకులు బుద్దరాజు సత్య నారాయణరాజు, తాతినాయుడు మహానాడుకు వెళ్లారు.

సీతమ్మధార : మహానాడుకు ఉత్తర నియోజకవర్గ నాయకులు వెల్లంకి భరత్ ఆధ్వర్యంలో పలువురు నేతలు, కార్యకర్తలు విశాఖ ఎంపీ శ్రీభరత్ కార్యాలయం నుండి సోమవారం బయలుదేరిన బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఆయా బస్సులను విశాఖ ఎంపీ శ్రీభరత్ జెండా ఊపి ప్రారంభించారు.

విశాఖ కలెక్టరేట్ : కడపలో మూడు రోజులపాటు నిర్వహించనున్న తెలుగుదేశం మహానాడుకు దక్షిణ నియోజవర్గం నుంచి 8 మినీ బస్సుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు సోమవారం బయలుదేరి వెళ్లారు. ఈ వాహనాలను పార్టీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ జెండా ఊపి ప్రారంభించారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

అక్రమ లేటరైట్ తవ్వకాలపై విచారించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :నాతవరం మండలంలో జరుగుతున్న అక్రమ లేటరైట్ తవ్వకాలపై అనకాపల్లి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశామని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. ఈ అక్రమ లేటరైట్ తవ్వకాల్లో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రోజుకు సుమారు కోటి 50 లక్షల రూపాయలు సంపాదిస్తున్నారని, దీనిపై త్వరగా అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వ్యక్తం చేశారు. ఈ తవ్వకాలతో స్థానిక ప్రజలకు, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని ఆయన ఆరోపించారు. నాతవరం మండలంలో లేటరైట్ తవ్వకాలపై ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళామని రోజులు గడుస్తున్నా ఎటువంటి చర్యలు లేవన్నారు. ఫిర్యాదు చేసినప్పుడు 15 రోజులు గడివిచ్చారని, గడువు దాటిపోతున్నప్పటికీ ఇప్పటికీ దీనిపై ఎందుకు విచారణ జరపలేదో అర్థం కావడం లేదన్నారు. లేటరైట్ తవ్వకాల కార్యకలాపాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విచారణ చేపట్టేందుకు వేసిన కమిటీ తవ్వకాలకు అనుమతులు లేవని చెప్పడం జరిగిందని అయినప్పటికీ జిల్లా కలెక్టర్ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

మాడుగులలో వర్షం

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల కేంద్రంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. వేకువజాము నాలుగు గంటల నుంచి తేలికపాటి జల్లులు పడుతూ ఉదయం 9గంటలకు కొంత సమయం ఎడతెరిపి ఇచ్చిన అనంతరం మద్యాహ్నం 2గంటల నుంచి మళ్లీ జల్లులు పడ్డాయి. రోజంతా వర్షం వాతావరణంతో మబ్బులు కమ్మేసి చిమ్మ చీకటిని అలముకుంది. వర్షం కారణంగా ఇక్కడ జరిగే సోమవారం వారపు సంతకు వచ్చిన వ్యాపారులు అవస్థలు పడ్డారు. సాయంత్రం ఆరు గంటల నుంచి వర్షం తీవ్రత అధికమై కుండపోత వర్షం కురిసింది.

సత్యసాయి రథయాత్ర

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగుల గ్రామంలో భగవాన్ శ్రీ సత్యసాయి ప్రవహిణి రథయాత్ర సోమవారం మాడుగులకు చేరింది. భగవాన్ శ్రీ సత్యసాయి జయంతి వేడుకల సందర్భంగా ఈ రథయాత్ర మాడుగులకు చేరడంతో స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రథయాత్రలో ఉన్న స్వామివారికి పూజ కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం సత్యసాయి భజన పాటలతో గ్రామ పురవీధులు గుండా రథయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, జోన్ ఇన్చార్జి లోవరాజు, జిల్లా ప్రతినిధులు రవి శంకర్, కృష్ణంరాజు, కామరాజు, రాజశేఖర్, శివరామకృష్ణ, మాడుగుల సమితి కన్వీనర్ కె.శ్రీనివాసరావు, బలరాం పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి -పాడేరు:రానున్న విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు ఇప్పటినుండే సూక్ష్మ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం స్థానిక కాఫీ హౌస్ లో ఐటిడిఎ ఆధ్వర్యంలో జరిగిన ఎటిడబ్ల్యుఓలు, ప్రధానోపాధ్యాయుల వర్క్ షాప్ లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది పదవ తరగతి ఫలితాలు అసంతృప్తిగా ఉన్నాయని, తదుపరి ఏడాదికి ఇప్పటి నుండే పక్కా ప్రణాళికతో విద్యార్థులను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల వారీగా, ఫలితాల్లో వెనుక బాటును గుర్తించి ఆయా సబ్జెక్టుల వారీగా వెనుకబాటుకు కారణాలను విశ్లేషించి ఉత్తమ ఫలితాలు సాధనకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జూన్ 03 నుండి పదవ తేదీలోగా విద్యార్థులు బేస్ లైన్ పరీక్షలు నిర్వహించి గ్యాప్‌లను గుర్తించాలని, విద్యార్థుల లెర్నింగ్ స్కిల్స్ మెరుగు పరచాలని సూచించారు.

మాట్లాడుతున్న సురేంద్ర

ఆదివాసీల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలి

-ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచార ఆర్భాటాలు మాని ఆదివాసీల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మాన పడాల్, పొద్దు బాలదేవ్ తో కలిసి మాట్లాడుతూ ప్రధాని ఆధ్వర్యంలో ఆదివారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ రాష్ట్రాల సిఎంలు, డిప్యూటీ సిఎంల సమావేశంలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆదివాసీల అభివృద్ధిపై చేసిన ప్రకటన వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. ముఖ్యంగా దుర్బల గిరిజన సమూహాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను పెంపొందించడానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కషి చేయాలని, ప్రచార, ఆర్భాటాలకు పోయి వాస్తవాలకు భిన్నంగా ప్రకటనలు చేయడం సరికాదన్నారు. పిఎం జన్ మన్ యోజన పథకం కింద పివిటిజిలకు గృహ నిర్మాణనికి రూ.10 లక్షలు, అంత్యోదయ కార్డులు మంజూరు చెయ్యాలని డిమాండ్ చేశారు. పివిటిజిల ఆవాసాలకు సురక్షితమైన గృహ నిర్మాణం, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, టెలికాం కనెక్టివిటీ, స్థిరమైన జీవనోపాధి అవకాశాలు వంటి ముఖ్యమైన సౌకర్యాలను అందించాలన్నారు. షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. నిధులు సరిపోక పివిటిసిలకు మంజూరైన గృహాల నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయన్నారు. మన్యం ప్రాంతాన్ని డోలీ మోతల రహితంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించి ఏడాది కావస్తున్నా నేటికీ 1500 గిరిజన గ్రామాల్లో మట్టిరోడ్డూ లేని పివిటిజి గ్రామాలున్నాయన్నారు. గర్భిణీలకు హాస్పిటల్ కు తరలించేందుకు అంబులెన్స్ రాలేని పివిటిజి గ్రామాలున్నాయని పిఎం జన్ మన్ యోజన పథకం నిధులతో ఎందుకు రోడ్లు వేయడం లేదని ప్రశ్నించారు.

జిసిసి మేనేజర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి గిరిజన సహకార సంస్థ (జిసిసి) మేనేజర్‌గా చల్లంగి సుగునాదం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పాడేరు డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, తదుపరి కార్యాలయ సూపరిండెంట్‌గా సేవలం దించిన ఆయన పదోన్నతిపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో చింతపల్లి జిసిసి మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరిం చారు. ఇప్పటివరకు డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వర్తించిన దేవరాజు, అదనపు బాధ్యతలతో మేనేజర్‌గా కొనసాగిన విషయం తెలిసిందే. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుగునాదానికి జిసిసి సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సహకార సంస్థ సూపరింటెండెంట్ మజ్జి రమణమూర్తి, సెల్స్‌మన్ శెట్టి చిన్నబ్బాయి, భారతి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పై ఫిర్యాదు

ప్రజాశక్తి -అనంతగిరి: అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అనంతగిరి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోవాలని సోమవారం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కుమార్, మండల తహసిల్దార్ మాణిక్యంకు అనంతగిరి పంచాయతీ బారోజోల అనంతగిరి గ్రామ ఉపాది కూలీలు సురేష్‌తో పాటు పలువురు ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని తెలిపారు. జాబ్ కార్డులో యాడింగ్‌కి నగదు వసూలు చేస్తున్నారన్నారు.

రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి

-కలెక్టర్‌కు నిర్వాసితులు, నాయకుల వినతి

మాట్లాడుతున్న నాయకులు, నిర్వాసితులు

ప్రజాశక్తి-నక్కపల్లి : వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులలో ఇళ్లులు కోల్పోతున్న కుటుంబాలలో 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ 25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని, నిర్వాసితులను అన్ని విధాలాగా ఆదుకోవాలని నాయకులు, నిర్వాసితులు డిమాండ్ చేశారు. అనకాపల్లి కలెక్టరేట్ లో సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి నాయకులు సూరకాసుల గోవిందు ఆధ్వర్యంలో అమలాపురం పంచాయతీ మూలపర్ర, పాటిమీద గ్రామ నిర్వాసితులు స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ కు వినతి పత్రం అందజేశారు. నక్కపల్లి మండలంలో రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, అమలాపురం, డిఎల్ పురం రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూములు సేకరించారన్నారు. ఇందులో భాగంగా బుచ్చిరాజుపేట కొత్తూరు, చందనాడలో కర్రీ వారి వీధి, తమ్మయ్యపేట, తుమ్మల పేట, పాటిమీద ,మూలపర్ర, బోయపాడు, డి ఎల్ పురం వాడపేటలను వేరే చోటకి తరలిస్తున్నారని, ఈ తరలింపు సందర్భంగా ఇల్లులు కోల్పోతున్న కుటుంబాలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి 5 సెంట్లు ఇంటి స్థలం, 8,36,000 రూపాయలు ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఇది చాలా అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిర్వాసితులకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. 25 లక్షల రూపాయలు ప్యాకేజీ చెల్లించాలని కోరారు. ఇంట్లో ఉన్నటువంటి పెళ్లి కానీ, పెళ్లయిన ఆడపిల్లలు కూడా 18 సంవత్సరాలు నిండిన వారికి ప్యాకేజీ చెల్లిస్తామని, ఆ కుటుంబాలను ఆదుకుంటామని పలు సందర్భాలలో నిర్వహించిన గ్రామ సభల్లో అధికారులు చెప్పడం జరిగిందన్నారు. నేడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి ఎంపిక చేసిన లబ్ధిదారుల లిస్టులో వివాహమైనటువంటి మహిళల పేర్లు లేకుండా జాబితా ప్రకటించారన్నారు. దీంతో అనేకమంది తీవ్రంగా నష్టపోవడం జరుగుతుందని, ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన హామీ మేరకు 18 సంవత్సరాలు పైబడినటువంటి ఆడపిల్లలకు కూడా 5 సెంట్లు ఇంటి స్థలం, 25 లక్షల రూపాయలు ప్యాకేజీ చెల్లించి, ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. డి ఫారం ,సాగు భూములలో గల తోటలకు ,చెట్లకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ప్రతి కుటుంబానికి ఆర్ కార్డులు ఇవ్వాలని, ప్రస్తుతం జరుగుతున్న పనులలో స్థానికులకు ఉపాధి కల్పించాలని, బోర్ వెల్స్, బావుల కు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు రావి ఈశ్వరావు, చిన్నమ్మలు, గణేష్, గురునాదరావు, మున్నా, నానాజీ, సోమేశ్వరరావు, బాబ్జి, సత్తిబాబు, బాబురావు, చంటమ్మ, లక్ష్మి, వరలక్ష్మి,లోవమ్మ పాల్గొన్నారు.

అరకులోయలో పర్యాటకుల సందడి

మ్యూజియం వద్ద పర్యాటకులు

ప్రజాశక్తి-అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకు లోయలో ఎట్టకేలకు సోమవారం సాయంత్రం పర్యాటకుల సందడి నెలకొంది. వేసవి సెలవుల్లో ఎండ వేడిమితో ఉక్కిరి బిక్కిరి వాతావరణం నెలకొవడంతో పాటు, మధ్యాహ్నం వేళలో అకాల వర్షాలు పడుతుండడంతో పర్యాటకుల సంఖ్య పూర్తిగా పడి పోయింది. దీంతో, ఇన్నాళ్లు వెలవెల బోయిన అరకులోయ పర్యాటక కేంద్రం బుధవారం పర్యాటకుల సందడి నెల కోవడంతో ఒకసారిగా కళకళలాడింది. స్థానిక గిరిజన మ్యూజియం, పద్మావతి ఉద్యానవన కేంద్రం ముఖ ద్వారాల వద్ద పర్యాటకులు సందడి చేశారు. వాతావరణం చల్లబడడంతో పర్యాటకులు తాకిడి మొదలైంది. దీనికి తోడు వేసవి సెలవులు మరికొద్ది రోజుల్లో ముగుస్తుండడంతో వివిధ ప్రాంతాల పర్యటకులు తరలివస్తున్నారు. పర్యాటకుల తాకిడి పెరగడంతో ఈ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతంలో టికెట్ల రూపేణా ఆదాయం సమకూరిందని నిర్వాహకులు తెలిపారు.

నివాళి అర్పిస్తున్న బివి రాఘవులు, నాయకులు, కుటుంబీకులు

రమణారావు సంస్మరణ సభ దృశ్యమాలిక

రమణారావు సతీమణిని ఓదారుస్తున్న రాఘవులు

సభలో మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న రాఘవులు, నాయకులు

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		